క్లుప్తంగా

నిప్పంటుకుని తాటి చెట్లు దగ్ధం

● సుమారు 30 గుంటల వరి పంట అగ్నికి ఆహుతి



కమలాపూర్ : కమలాపూర్ శివారులోని తాటి వనం సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పలు తాటి, ఈత చెట్లతోపాటు సుమారు 30 గుంటల వరి పంట దగ్ధమైంది. గీత కార్మికులు, స్థానిక రైతుల కథనం ప్రకారం .. ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కన్నూరు వైపు నుంచి కమలాపూర్ శివారులోని ఎల్లమ్మ గుడి వరకు మంటలు వ్యాపించాయి. గమనించిన గీత కార్మికులు, రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. అప్పటికే ప్రమాదంలో వరి కొయ్య కాళ్లతోపాటు పలు ఎకరాల్లోని పశు గ్రాసం దగ్ధమైంది. బండి కిషన్ అనే రైతు సుమారు 30 గుంటల్లో వాగులో వేసిన వరి పంటను కోసి పొలం గట్లపై కుప్పగా వేసుకోగా దగ్ధమై అతడికి సుమారు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లింది. బాధిత రైతులు కన్నీరు మున్నీరయ్యారు. పబ్బు రాజు అనే రైతుకు చెందిన కరెంటు మోటార్‌కు అమర్చిన ఒక బండిల్ సర్వీస్ వైరు కాలిపోయింది.

ప్రమాదంలో మొక్కజొన్న చేను..

దామెర : విద్యుత్ షాట్‌సర్క్యూట్ చోటు చేసుకుని మొక్కజొన్న చేను దగ్ధమైన ఘటన మండలంలోని కోగిల్వాయి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధత రైతుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొడారి రవి, కొడారి ఐలుకొమురు, గడబోయిన రాజాలుకు చెందిన సుమారు 5 ఎకరాల్లో పండించిన మొక్కజొన్న పంటలో కంకులను కోసి పొలంలోనే కుప్పలుగా పోశారు. కాగా ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ షాట్‌సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు వ్యాపించి పంటపొలాల్లోని కంకి కుప్పలకు అంటుకోవడంతో కాలి బూడిదయ్యాయి. చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతి అయ్యిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా పోస్టులు

● బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు, కార్యకర్త సస్పెన్షన్

పరకాల : బీఆర్ఎస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు గంటా కళావతి, మహిళా కార్యకర్త దామ రజని రుద్రమ సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టుకోగా ఆ ఇద్దరినీ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను పార్టీ నుంచి ఆదివారం సస్పెండ్ చేశారు. మహిళా కమిటీని పూర్తిగా రద్దు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఇద్దరు మహిళల నడుమ చోటు చేసుకున్న గొడవను జిల్లా, పట్టణ ముఖ్యనాయకులు సైతం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో వారిని సస్పెండ్ చేస్తూ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మడికొండ శ్రీను నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్ కమిటీ ఎన్నిక

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల రాజు, ఉపాధ్యక్షుడిగా బొనగాని శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడిగా రఘు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పుల్ల అశోక్ (చార్లెస్), బీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా సరిగొమ్ముల రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జక్కుల రాజు మాట్లాడారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేసే దిశగా చొరవ తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతోందని తెలిపారు. తమను ఎన్నుకున్న నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతిలో అఖండ నామసంకీర్తన



సంకీర్తన నిర్వహిస్తున్న భజన మండలి సభ్యులు

శాయంపేట : హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామదాసు భజన మండలి జిల్లా అధ్యక్షుడు మాదాడి రాజు, సభ్యులు తడక రవి, కూనూరు రాజు, శ్రీధర్, మహేందర్, ప్రభాకర్‌రెడ్డి, కుమారస్వామి, శంకర్, చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

● శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్

ధర్మసాగర్ : తెలంగాణలోని పేదలందరికీ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర శాసనసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ తెలిపారు. మండలంలోని కరుణాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను సాధించుకున్న తర్వాత బంగారు తెలంగాణ దిశగా అన్ని వర్గాల ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జరగనంతగా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. పేదలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలే కాకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి ప్రజలు అడగని అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్ర రైతాంగానికి చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తున్నట్టు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే తెలంగాణ అభివృద్ధి పథాన పయనిస్తోందని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోనే అత్యధికంగా రిజర్వాయర్లు నిర్మించి అన్ని చెరువులు, కుంటలను నీటితో నింపి సాగునీటి కొరత లేకుండా చూస్తున్నట్టు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో నియోజకవర్గం నాల్గో స్థానంలో నిలిచిందన్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో 21 రోజులపాటు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, ఏఎంసీ వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మల్లక్‌పల్లి సర్పంచ్ మునిగెల రాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండా ప్రకాష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

డార్విన్ సిద్ధాంతం తొలగింపు మూఢత్వం

● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వల్లపు ఉపేందర్‌రెడ్డి

శాయంపేట : పాఠ్యాంశం నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం కేంద్రంలోని బీజేపీ మూఢత్వానికి నిదర్శనమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వల్లపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రగతి సంగారం గ్రామంలో ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన సామాజిక శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచమంత విజ్ఞానం వైపు శరవేగంగా పయనిస్తుంటే భారతదేశ స్వార్థ రాజకీయ నాయకులు ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిన డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంలోంచి తొలగించడం దుర్మార్గమని చెప్పారు. హేతుబద్ధీకరణ పేరుతో సీబీఎస్ఈ పదో తరగతి సిలబస్ నుంచి ఎన్‌సీఈఆర్‌టీని కేంద్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 1800 మంది మేధావులు, శాస్త్రవేత్తలు డార్విన్ మానవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా కొనసాగించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. మతాలను, దేవుళ్ల నమ్మకాలను సజీవ సమాధి చేసి మానవ పరిణామ సిద్ధాంతానికి ప్రాణంపోసి సృష్టివాదాన్ని అంతం చేసి విజ్ఞాన శాస్త్ర వెలుగులను విశ్వమంతటికి అందించిన మహనీయుడుగా డార్విన్‌ను అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులను, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రణాళికాయుత కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందించి నాగరిక వికాసాలను అభివృద్ధి చేస్తూ మూఢత్వాలకు, అనాగరిక సంస్కృతులకు చరమగీతం పాడి బంగారు భవిష్యత్తుకు మార్గదర్శక విలువలను అందించడంలో ముందుండే దేశాలే అభివృద్ధి చెందుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, సహాయ కార్యదర్శి నీల రవీందర్, రాజిరెడ్డి, సావిత్రి, ఇంద్రారెడ్డి, బుచ్చయ్య, తిరుపతి, భద్రయ్య, మహేందర్ రెడ్డి, రాజన్న, వెంకట్‌రెడ్డి, రమేష్, కిషన్, రవీందర్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు 'డీపీఎస్' విద్యార్థి

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) విద్యార్థి శాగంటి శ్రీస్వాగత్ రాజ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడ్రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మండలంలోని మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఆయన డీపీఎస్‌లో చదువుతూ రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక కావడం పట్ల స్కూల్ చైర్మన్ వి.రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో శ్రీస్వాగత్ రాజ్‌ను రాజిరెడ్డి అభినందించి మాట్లాడారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఆటపాటలతో ఆరోగ్యం మెరుగవడమే కాకుండా సమాజంపై అవగాహన పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణిస్తేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. శ్రీస్వాగత్ రాజ్ రాష్ట్రస్థాయికి ఎంపికవడం పట్ల అతడి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



స్వాగత్ రాజ్‌ను అభినందిస్తున్న చైర్మన్ రాజిరెడ్డి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్.. 'సీఈఐఆర్'తో లభ్యం



బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ కిషన్

పరకాల : 15 నెలల క్రితం పోయిన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోలీసులు దొరకబట్టి బాధితురాలికి అందజేశారు. వివరాలిలా.. పరకాల ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న శ్రీరాం సునీత 15 నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఆమె మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసింది. ఆమె అప్లికేషన్‌పై స్పందించిన పోలీసులు తక్షణమే పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను దొరకబెట్టి ఆమెకు ఆదివారం అప్పగించారు. పోలీసులకు కండక్టర్ సునీత కృతజ్ఞతలు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు మీసేవా ద్వారా సీఈఐఆర్ అప్లికేషన్ చేసుకోవాలని సీఐ పుల్యాల కిషన్ కోరారు. కార్యక్రమంలో పరకాల ఎస్సై ప్రశాంత్ బాబు పాల్గొన్నారు.

నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు : నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరంగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండలంలోని జోగయ్యపల్లి, సింగారం గ్రామాలకు చెందిన నలుగురికి కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన వారి ఇండ్లకు ఆదివారం వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆడపిల్లల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ నిలుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, సింగారం పీఏసీఎస్ చైర్మన్ జయపాల్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కోడి కుమారస్వామి, సింగారపు కనకయ్య, రాధ, సుక్కమ్మ, సుధాకర్, పోచయ్య, ఈదురు లక్ష్మి, బిళ్ల ఆగయ్య, తాడెం పుల్లయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అమర జవాన్ స్మారక టోర్నీ ప్రారంభం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి హాజరు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామంలో సీఆర్పీఎఫ్ అమర జవాన్ ర్యాకం శశిధర్ స్మారకంగా ఏర్పాటు చేసిన ఉప్పల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ముందుగా శశిధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జెడ్పీటీసీ లాండిగె కల్యాణి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీలు ఎర్రబెల్లి సంపత్‌రావు, తూర్పాటి అరుణ క్రాంతి, కోఆప్షన్ సభ్యుడు ఖాజా హసనొద్దీన్, మాజీ జెడ్పీటీసీ మారపెల్లి నవీన్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, టోర్నీ బహుమతి ప్రదాత నాయినేని తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సుధీర్

డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మనోహర్



ఎల్కతుర్తి : దళిత హక్కుల పోరాట సమితి (హెచ్‌పీఎస్) హన్మకొండ జిల్లా అధ్యక్షునిగా మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన నిమ్మల మనోహర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో మనోహర్ మాట్లాఆరు. తనపై ఉన్న నమ్మకంతో పదవి అప్పగించినందుకు అనిల్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దళిత హక్కుల సాధనకై తనవంతు కృషి చేయనున్నట్లు వెల్లంచారు.

కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సద్దాం హుస్సేన్

ధర్మసాగర్ (వేలేరు) : సీఎం కప్ కబడ్డీ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వేలేరు మండల కేంద్రానికి చెందిన ఎండీ.సద్దాం హుస్సేన్‌ను నియమించినట్టు ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా అజీజ్ ఖాన్ మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో ఈనెల 28 (ఆదివారం) నుంచి మూడ్రోజులపాటు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీలకు జిల్లా నుంచి కబడ్డీ క్రీడాకారుల జట్టును హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంకు పంపించినట్టు తెలిపారు. జట్టుకు కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సద్దాం హుస్సేన్ కెప్టెన్‌గా, వైస్ కెప్టెన్‌గా అశోక్, సభ్యులుగా తిరుపతి, అజయ్, శ్రావణ్, రేవంత్, అరవింద్, అఖిల్, ఉదయ్, విక్రమ్, కోచ్‌గా శంకర్ నియమితులైనట్టు వివరించారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే సమగ్రాభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

శాయంపేట : డబుల్ ఇంజన్ సర్కారు పాలనలో ఉంటేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మాందారిపేట గ్రామంలో ఉపాధ్యక్షుడు మోత్కూరి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు కేటాయిస్తోందని తెలిపారు. ప్రధానిగా మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 30 నుంచి నెల రోజుల పాటు తలపెట్టిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తద్వారా రాష్ట్రంలోనూ రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే తెలంగాణ అన్ని రంగాల్లోనూ సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీకి అధికారంలోకి వస్తేనే పేద, మధ్య తరగతి ప్రజలకు సుపరిపాలన అందుతుందని తేటతెల్లం చేశారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి రాజమౌళి గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు తాటికొండ రవికిరణ్, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకులు వెంకటయ్య, రమణారెడ్డి, దేవరాజ్, రాఘవేంద్ర శర్మ, శివ, శ్రీను, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రవ్యాప్త మహాసభలు



పరకాల : ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత సాధించడం కోసం జూన్ 3 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాలో మహాసభలు నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్పీ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ తెలిపారు. పట్టణంలోని అమరధామంలో మహాసభల కరపత్రాలను ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం సుదీర్ఘకాలంగా నడుస్తున్న ఉద్యమం కీలక దశకు చేరుకుందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం సానుకూలంగా స్పందించినప్పటికీ తక్షణమే అమల్లోకి తీసుకొచ్చి రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేలా ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. జూన్ 4న హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న పార్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్, జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్, మండల ఇన్‌చార్జ్ బొచ్చు అనంత్, నాయకులు రమేష్‌కుమార్, రమ, సునీత పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్కతుర్తి : దండేపల్లిలో పూర్వవిద్యార్థులు



ఎల్కతుర్తి : మాణిక్యాపూర్‌లో..

ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అవరణలో 1989–90వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాటి విద్యార్థులు ఒకే చోట కలుసుకుని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాడు విద్యా బోధన అందించిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు.

భీమదేవరపల్లి మండలంలో..

మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాణిక్యాపూర్, రత్నగిరి, కొత్రపల్లి, అమ్మనగుర్తి గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఆటపాటలతో హోరెత్తించారు.



శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 1994–95 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఘనంగా సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రమేష్, రజనీకాంత్, రాజేంద్రప్రసాద్, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలి

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయచందర్‌రెడ్డి

ఆత్మకూరు : కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి కోరారు. మండలంలోని పెద్దాపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆ పార్టీ బృందం ఆదివారం పరిశీలించింది. అనంతరం 'మన్‌కీ బాత్' 101వ ఎపిసోడ్‌ను నాయకులు వీక్షించారు. తదనంతరం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించగా విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. ప్రజలు బీజేపీ పాలన కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈనెల 30 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ అందిస్తున్న పాలన గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ది మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పుల్యాల రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, గురిజాల శ్రీరాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, నాయకుడు గట్టు వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని మాందారిపేటకు చెందిన బడుగు శ్రీలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పరామర్శిస్తున్న గండ్ర సత్యనారాయణరావు

'బీజేపీ బలోపేతమే లక్ష్యం'

ఎల్కతుర్తి : మండలంలోని బీజేపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి కోరారు. మండలంలోని సూరారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కోరారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పభ్రుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, జనగాని కిష్టయ్య, ముష్కె వెంకటేష్, కోరె కార్తీక్, పల్లెపాటి మధుకర్, కపివర్ధన్, సదానందం, బీట్ల లింగయ్య, రాజు, శ్రీకాంత్, వినయ్, రమణాచారి, పెరుకు మధు, సంపత్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తిపై కత్తితో దాడి



గాయాన్ని చూపిస్తున్న వెంకట్‌రెడ్డి

నడికూడ : స్థల వివాదంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన వడ్లకొండ వెంకట్‌రెడ్డి, ఆకుల సుదర్శన్ గౌడ్, ఆకుల ప్రభాకార్ గౌడ్ మధ్య కొద్దిరోజులుగా స్థల వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై దామెర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. ఇటీవల పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య పరిశీలించి విచారణలో చేపట్టారు. కాగా సదరు స్థలంలో ఆకుల సుదర్శన్ ఆదివారం రేకుల షెడ్డు వేయడానికి ప్రయత్నించగా వెంకట్‌రెడ్డి అడ్డుకునేందుకు యత్నించాడు. దీంతో సుదర్శన్ ఇంట్లో ఉన్న కత్తి తీసుకొచ్చి వెంకట్‌రెడ్డిపై దాడి చేశాడు. వెంకట్‌రెడ్డి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.